




# గ్రహాచారం.

యనమండ్ర సాంబశివరావుగారు

౧

“ఏమేవ్! నువ్వు గింజుకు చచ్చేదీ, ఊరవతల పెద్ద నూతులో పడేదీ, పీక్క వురేసుకొనేదీ, నేను మాత్రం రంగారెడ్డికితప్ప అమ్మాయిని మరోహళ్లకిచ్చి పెళ్లిచెయ్యను” అన్నాడు గౌరరెడ్డి వీధి అరుగుమీద ఎదురుగుండా మోకాళ్లు మడిచి కూచున్న పెళ్లాం పున్నమ్మతోటి.



“మీరంటే అన్నారు కాని నా బొందిలో ప్రాణం పెనుగులాడుతున్నదాకా. కాసుల్ని ఆ ముసలిముండాకొడుక్కి కట్టపెట్టనిస్తే ఛీ అనండి. పెళ్లిపీటలమీదకి ఎవర్ని తెచ్చుకుంటారో తెచ్చుకోండి. ఆకాశం బద్దలైనా నేనురాను” అంది చురచురలాడుతూ పున్నమ్మ.

“నువ్వురాకపోతే నీలాంటిది మరోత్తి” అని చేతికర్ర వూతచేసుకుంటూ స్నానానికని వెళ్లిపోయేడు గౌరరెడ్డి.

పున్నమ్మ ఆవేళ వంట చేయడం మానేసింది కోపంవచ్చి. కేకవేస్తున్నా మొగుడికి కుంకుడు కాయలైనా కొట్టి ఇచ్చింది కాదు. అప్పుడు ఆడబొడుచు అంకమ్మ వెళ్లి నీళ్లుకాచి ఇంత చవురుముక్క ఇచ్చేదాక దిక్కులేకపోయింది గౌరరెడ్డికి.

౨

కాసులి కిప్పుడు పదహారో ఏడు నడుస్తోంది. ఈవిడ తల్లికడుపులో వున్నప్పుడు

దీపావళి అమావాస్యకీ పున్నమ్మ పుట్టింట్లో ఆవులసాల తగలడిపోయిందిట. అందులో చిక్కడ్డ బందరు కోడె దూడని కాపాడ్దామని పున్నమ్మతండ్రి రామిరెడ్డివెళ్లి అందులో మాయమైపోయేడు. అప్పుడే యీసందర్భం జరిగి పదిపే నేళ్లు పూర్తయి రెండునెల్లయిందిట. ఆ లెక్కని చూస్తే కాసులికినిండా పదహారేళ్లు లేకపోయినా అధమం పదిహేనేళ్లకి తక్కువ వుండ వంటుంది పున్నమ్మ. కాస్తో కూస్తో తెలివైందిన్నీ చురుకైందిన్నీ అవడంచేత తనపెళ్లిగురించి ఇట్టేలాడుతూన్న తల్లినీ తండ్రినీ చూస్తూ తెలతెల పోతోంది కాసులు.

కాసులి అందం చెప్పడానికన్నా తెనుగులో భాష లేదని చెప్పుతూండేవాడు మారెళ్ల సుబ్బన్నకవి ప్రయత్నంమీద వ్రాయగావ్రాయగా ఒక చిన్నగీతం ఆవిడమీద వ్రాసి ముమ్మాటు చదివేసి. ముమ్మాటూ కూడా పున్నంచంద్రుడు అతనికి కనిపిస్తూండేవాడు. "ఛీ! చంద్రుడికీ కాసులికీ అందంలో సాటెక్కడ" అని ఆకాగితం చింపిముక్కలుచేసే వాడాయన.

నందగిరివారి లోగిట్లో బసచేసిన నూకారెడ్డికి కాసుల్ని పెళ్లాడాలని వుండేదిట. కాని, వాళ్ల నాన్న పిల్ల నిమ్మని అడగొస్తే అరుగుపక్కనున్న అంబోతుని వెంటతరిమేట్ట గౌరరెడ్డి. సూరపరెడ్డి పెద్దబుల్లాకుగారి ముత్యాలు, కాసులు గోదావరిలో నీళ్లుతీస్తూంటే చూసి పెళ్లాడాలని మనసేసి పినతండ్రిచేత కబురుపెడితే వూళ్లో వూరకుక్కల్ని ఉసికల్పేట్ట గౌరరెడ్డి. సీతారామయ్యగారు యీసంగతి తెలుసుకుని, తనకి ఎదురు చెప్పగలవాడా గౌరరెడ్డి, అని ధైర్యంతోటి తనకొడుకు బుచ్చిరెడ్డికి కాసులిన్నమ్మని, ఆవూరికరణంగారిని, పసుపుకుంకం, కొబ్బరికాయలు, సేలంచీర, కుంకుడు కాయలు, నువ్వునూని కావిడిచ్చిపంపిస్తే.

"కాసులు మాచక్కని చుక్కండి, దాని చక్కదనం పోషించే లక్షాధికారికన్నా ని దాన్నియ్యాలండి" అని చెప్పి కావిడిని కరణాన్ని తిరగ్గొట్టేసేట్ట గౌరరెడ్డి.

ఎంతజమీందార్లకో లేకపోతే మహారాజులుంగారికో ఇచ్చి పెళ్లిచేస్తాడు కాసులికని కోరచూపులు చూస్తూన్నారు వూళ్లోవాళ్లంతాను.

## 3

ఆవేళ మొగుడిమీద కోపంవచ్చి పున్నమ్మ అందరికంటే ముందు భోజనం చేసేసింది. అన్నగారు రాకుండా వొదినగారికి కుంభం పోయాలని విసుగ్గుంటూ అంకమ్మ నెయ్యి వెయ్యకుండా అన్నంపెట్టింది పున్నమ్మకి. ఈవిడమీద కోపం మొగుడిమీద కోపం జంటచేసి కుంభంమీద విసిరిగొట్టింది పున్నమ్మ. విస్తట్లో పదార్థాలన్నీ ఒకేమాటు కలిపేసుకుని మాంచి గేదపెరుగుతోటి మర్దనాచేసి కష్టంమీద మింగి, యీ ఆయాసం చేత వచ్చిన నిద్దర్ని ఆపరిస్తూ పరసాటింట్లో పందిరపట్టె మంచంమీద బోర్లాపడుక్కుని గురెట్టుతోంది. గౌరరెడ్డిమాత్రం శాంతంగా భోజనం చేసేడు. భోజనం చేసినంతసేపూ దృష్టంతా పున్నమ్మమీదే వుంది. ఆవిడ మాటకాదని కొట్టిస్తే ఏడుస్తుందనే జాలి ఒకపక్కని, ఆవిడమాట విని పిల్ల కేసంబంధం చేయడం మానేస్తె, ఇంతసబ్బున్న పెళ్లికొడుకు దొంకడం కష్టం అనేమాట రోహపక్క నీ పీడిస్తున్నాయి గౌరరెడ్డిని. ఎలాగైనా మంచిమాటలు చెప్పి పెళ్లాన్ని ఒప్పిద్దావని ఉద్దేశించుకొని, భోజనం చేసి, ఆవిడ పడుక్కున్న మంచంమీదే ఒకపక్కని ఇరికేడు.

ఒక అరగంటకి లేచింది పున్నమ్మ. నిమ్మళంగా లేచి మంగళసూత్రాలున్న నాను సద్దుకుంటోంది. తర్వాత మొగుడ్ని దాటి అవతలపడ్డానికి ప్రయత్నం చేస్తూంటే గౌరరెడ్డి గట్టిగా పట్టుకుని,

"ఏమే......" అని ఏమో అనబోతూంటే

""నన్ను వదిలెయ్యండి"అని అరుస్తూ కూచుంది పున్నమ్మ. ఎలాగో మంచిమాటలు చెప్పి ఆవిడ నోరు కట్టేసేడు రెడ్డి.

"నన్ను వదిలేయండి"అనే పున్నమ్మ అరుపు విని ఏదో కొంప మునిగిపోతూందని కాసులు పక్కగది

కిటికీదగ్గరకి వచ్చి చూస్తోంది. అప్పటికే ముసలాళ్ళిద్దరూ ఇలాగ మాట్లాడుకుంటున్నారు:

గౌరరెడ్డి:—మరీ, వైద్యుడిగారి సంబంధం నీకెందుకు నచ్చలేదూ?

పున్నమ్మ.—ఆమాట నన్నెందుకు అడుగుతారు? కన్నపిల్ల తర్వాతగ ఏమవుతుందో యీడొచ్చినవారు మీ రాలోచించుకోవద్దూ?

రెడ్డి.— ముసలాడనేనా!

పున్నమ్మ.—అనేనా ఏవిటి ఇంకాను! నిండా ఎనభై ఏళ్లుంటేను? తెల్ల గెడ్డం గుండెలమీదకి పాకడం కనపడదూ? అన్ని పళ్లువూడేయిటకూడాను.

రెడ్డి.—అవునే అతని కెంతడబ్బుందో ఎరుగుదువా? ఇన్నీసుపేటనిండా అతని మేడలే! అతను ఇంగ్లీషు వైద్యుడుకూడాను. రెండో పెళ్లయినా పిల్లలు లేరు. మన కాసులి కేం?

పున్నమ్మ.— కాసులికేవా! హు! హూ! వాడి డబ్బూ వాడి మేడలూ గోదార్లో పడెయ్యండి. కాసులిని రంగారెడ్డి కిచ్చి పెళ్లి చేస్తే నేనొప్పను.

రెడ్డి.—నువ్వ గింజుకుచచ్చినాసరే, రంగబాబుకి పిల్ల నియ్యకమానను. అది అక్కడెంతో సౌఖ్యపడుతుంది. కావలసినన్ని వస్తువులు, చీరలు, మేడలు, బళ్లు మోటారుకార్లు, నీ అయ్యనాడైనా ఎరుగుదువా ఇది?

పున్నమ్మ.—అయ్యనా డెరగలేదు. యీనాటికి మీ నాటా ఎరగలేదు. కాసులు మాత్రం వాళ్ల అయ్యనాడెరుగునా ఏవిటి?

రెడ్డి.—ఓసి, నీ అన్న తలగొట్టా! నా హయాంలో సుఖం అనుభవించలేదనే కాసులికి ముందుగతి వుంచిది చూపిస్తున్నానే!

పున్నమ్మ.—ఈమాటమీద మళ్లీ మీతో మాట్లాడితే ఒట్టూ. మీ ఇష్టం వచ్చినట్లు చెయ్యండి. పిల్ల మీది. గోతులో దింపుతారో నూతులో దింపుతారో నాకేం కావాలి? అని వెళ్లిపోయింది.

రెడ్డి.—'నూతులోనూ దింపను, గోతులోనూ దింపను. రంగారెడ్డి అయిదంతస్తుల మేడమీద దింపుతా'నని నవ్వుకున్నాడు. కాసులుకూడా తనున్నగదులోంచి పెరట్లోకి వెళ్లిపోయింది.

౪

కాసులికి యీడువచ్చినా స్వాభావికమైన సుగుణసంపత్తే కాని బాహ్యప్రపంచంలోంచి ఎరువు తెచ్చినదెంతమాత్రం లేదు. దీనికి కారణం ఆవిడ పుట్టిన దగ్గర్నుంచి తన ఊరు, తాతగారివూరైన "పుళ్ళ" తప్ప ఇంకేవూరూ చూడలేదు. సాలికుంచాలు, గౌడు పెదగొల్ల, దాసరి వేంకాయ, తోటకూర కనకం, పెమ్మరాజు మాణిక్యంను యీవిడ బాగా ఎరుగున్న పేదరాసి పెద్దమ్మలు. ఎప్పుడైనా వీధిలోకి వస్తే తరుచు కనిపించేవాళ్లలో భాగవతుల భావ్యంమాత్రం ఒకడు. ఇటువంటివాళ్ల ఇరుగుపొరుగులో కాపరంవుంటే కాసులెంత తెలివితేటల్దయినా ప్రపంచజ్ఞానం ఎక్కడనుంచి తెచ్చుకుంటుంది? పోనీ చదువుకుందా అంటే తండ్రికే లేనిచదువు బిడ్డకెలా వస్తుంది? శుభ్రంగా తలకి కొబ్బరినూని రుద్దుకొని మధ్య పాపిడి తీర్చి వెనక్కాల సిగేసికుని దానిమీద ఒకబంతి పువ్వుముడిచి వాళ్లమ్మకి సారితెచ్చిన రేకు అద్దంలో సొగసు దిద్దుకోవడమేకాని మాంచివాసనేసే తలనూనిలు, ఎడంపాపిళ్లు, రిబ్బనుముడిజడ, అందులో దూర్చేటందుకు ఎఱ్ఱ గులాబీపువ్వులూ యీసొగసంతా చూసుకుందుకు నిలువుటద్దం ఎక్కడేనా చూసిందా వీవన్నానా? కాటిక పెట్టుకోందే ఒకనిమిషమేనా వుండేమో అడగండి ఇంకా గంగిరెద్దు బాచిగాడిని. ఆవిడ అంతా వెర్రిమాలోకం. పురాతన ఫక్కీ. ఈవిధంగానే వుంటాయి ఆవిడ భావాలనికూడా చెప్పడం ఎందుకూ?

ఆవేళ తల్లీ తండ్రీ తనగురించి జగడంఆడ్డం చూసి దానికాకారణం కనిపెట్టింది కాసులు. అక్కడ ఇంకా నించోలేకపోయి గబగబా కళ్లుతుడుచుకుంటూ పెరట్లో వున్న పెద్దగన్నేరుచెట్టుకింద కళ్లి వెక్కివెక్కి రాగాలుపెట్టుతోంది. ఆవిడ్ని దుఃఖంలోంచి మళ్లిదా

వని కావోలు గన్నేరుపు వ్వోకటి గాలికి వొంగి ఆవిడ
కళ్లనేసి కొట్టింది. ఆపువ్వును కోసి చేత్తో పట్టుకుని
యీవిధంగా ఆలోచించుకుంటోంది కాసులు. “ఎనభై
ఏళ్లట—తన తాతకైనా లేవు టన్నేళ్లు—గెడ్డం గుండె
లమీద కెగబాకుతోందిట—ఒకమాటు వాళ్ల వూరొ
చ్చిన చిటికెలభైరాగికి తప్ప ఇంకెవ్వరికి అంతగడ్డం
చూడలేదుట. పళ్లువూడిపోయేయిటకూడాను. ఒకవేళ
తాను చక్కిలాలు చేసిపెడితే ఎలాగతింటాడు పాపం-
అని గోలుమని ఏడ్చింది కాసులు. తాను చుట్టి తామల
పాకు లతని కివ్వడానికి నోచుకోలేదా అనుకుంది.
ఇంతకీ తండ్రి పెళ్లిచెయ్యాలని పట్టుపట్టేడు. అతని
కెంతచెప్పినా వినకు. ఇంకా ఆదుర్దాపడితేమాత్రం
ఏంకార్యం. తన అదృష్టాన్నెవ్వళ్లు మళ్లిస్తారు. మందూ
మాకూ తండ్రికిచ్చి మనసువిరిచే స్వభావం కాదు కాసు
ల్ది. కనక, తండ్రి ఎలాగ చెప్తేఅలాగ తలవంచడమే
భావ్యం అనుకుంది. అంతకంటే వుద్దేశాలు పరిగడితే
కామా ఆవిడకి? డాక్టరుగారికి డబ్బు బాగావుందిట!
పెద్దమేడలూ, సారట్లూ, కార్లూ, నౌకర్లూ, ఇంకా
ఎన్నో వున్నాయిట. వాళ్లతండ్రి కున్నట్టు పూరిల్లూ,
మిద్దేనా? పోతులబండి, ఎండ్లబండీ, సవారీలూనామరి?
యీతవెంకడిలాగ ఒక్కడేనా మరి పాలికాపు? ఇది
కాకుండా వస్తువు లెన్నో పెడ్తారుట. అని అనుకుంటూ
తన ఒళ్లంతా చూసుకుంది కాసులు. ఒళ్లంతా బంగారం
మయం. ఇంకెందుకూ శరీరంలో చోటేలేదు. ఆనగిషీల
ఒంటిపేటగడియారంగొలుసా! మోహర్లుకట్టిన కాసుల
పేరా! పలకసర్లా! మువ్వలవడ్డాణమా! ఆరత్నపులో
లక్కులా! ఇవేవి టవేవిటి? ఎన్నో కనిపించేయి.
ఇంక పైముచ్చట్లకా! తన “మొగుడే” వున్నాట్ట.
తర్వాత దేవు డున్నాడంది కాసులు. అంతేకాని,
తండ్రిమాట కాదన్డానికి తలంపే వచ్చిందికాదు పాపం.

✂

ఆషాఢబహుళవిదియా సోమవారంనాడు, చిత్తా
నక్షత్రంలో రాత్రిపదకొండుఘడియల ముప్పైఅయిదు
విఘడియలకి రాజమండ్రిడాక్టరుగారు బాపినేని రంగా
రెడ్డిగారు పూరెళ్ల గౌరరెడ్డిగారి కూతురు కాసులు
మెడలో మంగళసూత్రం కట్టేసేరు. అది కట్టబొయ్యే
టప్పుడు పెళ్లికొడుక్కి వచ్చిన వణుకు చూడలేదు.
కాని చేతినున్న “రిస్టువాచీ”నిమాత్రం చూచి పొంగి
పోయింది కాసులు.

పెళ్లైనమర్నాడే కాసుల్ని సారిచ్చి అత్తింటికి
పంపేరు. పెళ్లిసమయంలో డాక్టరుగారు చేయించిన
వైభవానికి రాజమండ్రీపురవాసులంతా ఆశ్చర్యపడ్డారు.
పెళ్లికూతుర్ని చూడ్డాని కొచ్చిన ఆడాళ్లూ మొగాళ్లూ
“చక్కనిచుక్క—రత్నంలాంటిపిల్ల— ఇంతందమైనఅ
మ్మాయి ఎక్కడాలేదు” అనుకున్నారు. ఒకళ్లిద్దరు
మొగాళ్లీమాట లనడం విన్నారు డాక్టరుతాతగారు.
ఇహనొచ్చెయెక్కడలేని రోషం, అనుమానంనూ. తను
చేతకానివాడనీ ముసలాడనీ ఎంచి పెళ్లాం ఎవరివేపైనా
చూస్తుందేమో అనేభయం, అనుమానంను అతన్ని పిశా
చంలాగ పట్టుకుని బాధించేస్తున్నాయి. దీనికే “పడుచు
పెళ్లాం, ముసిలిమొగుడ” నే సామెత. ఈ అనుమానంతోటి
ఆయన ఇల్లుదాటి వెళ్లడానికి జంకేవాడు. రోగులు
మొర్రెట్టుకుంటే, అయిదునిమిషాలు కారుమీద రంయని
పోయి రివ్వున వచ్చేసేవాడు. కాంపౌండరు సాహేబు
బజార్లోంచి బత్తాయిపళ్లు తెచ్చి అమ్మగారికి స్వయంగా
ఇస్తే బాబుగారికి అనుమానం. గెడ్డాం కిందకి దింపి
నోరువెలిబెట్టి సాహేబుకాసి ఎగాదిగా చూస్తాడు.
అప్పుడుపుట్టిన పిల్లాడైనా కాసులువేపు చూసి చిరు
నవ్వునవ్వితే, డాక్టరుగారికి మింగేద్దామా అనివుంటుంది.
ఆపిల్లా డేమిస్తూంటే, కాసులు తనకిలేగనే చంటా డేదు
స్తున్నా డనుకుంటాడు రంగారెడ్డి. కాసులికీ ఆసుపత్రి
వాళ్లకీ సంపర్కం లేకుండా ఆసుపత్రిని మరోహ
మేడమీదికి మార్చేసేడు. తనమాత్రం పెళ్లాన్ని కని
పెట్టు కూర్చునేవాడు. ప్రేమచేతకాదు అనుమానంచేతే.
పెళ్లాడితే సౌఖ్యం వస్తుందనుకుంటే, మనస్సులో ఆవే
దనా, అనుమానం, భయం ఎక్కువయ్యేయి పాపం మన
వైద్యుడిగారికి. ఆదుర్దా ఇంకా తీరక ముసిలివీరన్నని
దగ్గరట్టేపెట్టి, డాక్టరుగారు పెళ్లాన్ని గదిలో పెట్టి పైని
తాళం వేయడం మొదలెట్టేరు.


ఈవిధంగా రెండేళ్లు గడిచేయి. కాసులికి రాజమండ్రవరం నీళ్లు వంటపట్టేయి. కొంచం నవీనత్వ, నాగరీకత అబ్బేయి. సిగమానేసి బర్మాముడి వేస్తోంది. ఎడం పాపిడి దిద్దుతోంది. గులాబీపువ్వులు ముడుచుకుంటోంది. భుజంరవికెలు తొడుగుతోంది. "భారతి" పుస్తకాలు చదువుతోంది. ప్రపంచజ్ఞానం కొంచెం అబ్బినతర్వాత, తనస్థితి గ్రహించుకుంది. ఆవిడ చాలా అందమైందని ప్రపంచం అంతా అనుకుంటోందని గ్రహించింది. తన నిర్భాగ్యత మనసుకి నాటింది. ముసలాడ్ని చూస్తే ఇదివరకున్న ప్రేమ తగ్గుతూంటే తన యౌవనం వృథా అయిపోతోందనుకుంది. ఇంకా ఏవేవో విమర్శించుకుని ఇంక మొగుడు పెట్టే బాధలకీ అదుపులికీ లొంగ ననుకుంది. ఆ రాత్రెలాగో దెబ్బలాడి తనగదికి తాళంవేయించడం మానిపించేసింది. ఈ రెండేళ్లనుంచీ కాసులి ప్రవర్తన కనిపెట్టుతూ లోపా ల్లేవనే గ్రహించి ఇంత సాహసం చేసేరు తాతగారు.

౬

యథాప్రకారం రంగారెడ్డిగారు భార్యని వీరమ్మ కప్పచెప్పి రోగుల్ని చూడ్డానికని వూరంట కారేసుకుని వెళ్లిపోయేరు. ఆయని ఇల్లుదాటిన కొంతసేపట్లో మేడమీద వీధిగదిలో కిటికీ దగ్గిరనించుని వీధివేపు చూస్తోంది కాసులు.

ఆ మేడ కెదురుగుండా మ్యూనిసిపాలిటీవారి పుస్తకభాండాగారం ఒకటుంది. అందులోకి రోజూ సాయంత్రంవేళ వెళ్లి "పేపరు" చదువుతూండే వాళ్లలో చంద్రారెడ్డి ఒకడు. ఇతనికి ఇంచుమించు ఇరవైఆరేళ్లుంటాయి. మంచి జవాను, అందకాడున్నూ. సొగసుగా వుండేవాళ్లల్లో ఒకడని చెప్పొచ్చు.

"పేపరు" చదివేసి ఇంటికి వెళ్లిపోయేసమయంలో కాసులితని కన్పించింది. హఠాత్తుగా వులిక్కిపడినట్టు ముందు బెదిరేడు. తర్వాత వింతచూపుల్తో మళ్లీ ఆవిడిని చూసేడు. కాసులుకూడా ఇతన్ని చూసింది. బిడియపడి వెనకంజవేసి అతనివేపు గమ్మత్తుగా చూస్తూనే లోపలికి వెళ్లిపోయింది. ఆచూపుల్లో వున్న అర్థంను ఊహోన్నా గ్రహించేడు చంద్రారెడ్డి. కాసుల్ని తలుచుకుంటూ ఇంటికి వెళ్లేడు. "ప్రేమ" అంటే ఒకా



'తర్వాత వింతచూపుల్తో ఆవిడిని చూసేడు'

నొకప్పుడు కాసులికి అంధకారంలాగ కనిపించేది. ఆ అంధకారాన్ని పోవుచేస్తే అదివరకు డాక్టరుగారి మూర్తి ఆవిడకళ్లకి కట్టినట్టుండేది ఈడొచ్చినకొద్దీ తాతగారిమూర్తిలో "ప్రేమ" స్వరూపంమారి "అసూయ" స్వరూపం వచ్చింది. ఏవిధాన్నీ కూడా కాసులికి డాక్టరుగారి పొత్తు సౌఖ్యంగాలేదు. ముసిలిమొగుడ్ని పెళ్లాడినందుకొచ్చే కష్టాలు ఆవిడ గుండెల్లో బాగా నాటేయి. తల్లివొద్దన్నా యీపెళ్లి పంతంతోచేసిన తండ్రిగౌరరెడ్డిని తిట్టింది. "నాకీపెళ్లొ"ద్దని ఆనాడే ఎందుకు చెప్పకపోయేనా అని ఏడ్చింది. ఇంతట్లోకే చంద్రారెడ్డి ఆకడ ధ్యానన్లో కనిపించేడు. అతనికిన్నీ రంగారెడ్డికిన్నీ, వున్న భేదం కనిపెట్టింది. తానిప్పు డెంతందంగా వున్నా

ఎంత పెద్దబొట్టు పెట్టుకుంటూన్నా, నిజంగా భర్తవున్నా లేనిలోపం గ్రహించింది. ఇంక బాహ్యప్రపంచంలోకి చంగున గెంతేస్తానని నిశ్చయించుకుంది. చంద్రారెడ్డి భాండాగారాని కొచ్చేసమయానికి కాసులు మేడమీద కటికీదగ్గిరే నించునేది. ఒక్క పదినిమిషాలు వారిద్దరూ కళ్లతోటి ప్రేమని కురిపించే ఉత్తరాలు పంపుకునేవారు. ఆకాబుఖఒకరినొకరు ప్రేమించుకున్నట్లు చెప్పేయి.

## ౭

చంద్రారెడ్డి కాసుల్ని చూసినప్పటినుంచీ స్థిరంగా వుండలేకపోతున్నాడు; మనస్సు చంచలం అయిపోతోంది; మరొక పనేదీ తోచడం లేదు. ఇదంతా ఒక జాడ్యంలోనికి దింపుకుందేమో అని గజగజలాడుతున్నాడు. తనఆవేదన స్నేహితు లెవ్వరితోనైనా చెప్పితే మనస్సు స్థిమితపడ్డమేకాకుండా కాసుల్ని తనదగ్గరకి చేర్చడంలో సహాయం అవుతారేమో అనుకుని కండువా వేసికుని మ్యూజియంలోకి వెళ్లేడు. మ్యూజియంతోటలో చపటామీద చంద్రారెడ్డికొక ముసీలిమనిషి కనిపించేడు. ఈయన ఆఊళ్లో ఒకడాక్టరుగారని కూడా అతనికి తెలుసును ఈకారణంచేత, తనఅవస్థ ఇతనితో చెప్పితే వృద్ధుడుకనక తన అనుభవంమీద ఏవైనా సలహాఇవ్వవచ్చును లేకపోతే, అవసరమైతే జబ్బుకుదర్చడానికి మందేనా ఇస్తాడని అనుకున్నాడు. నిండుగుండెతో డాక్టరుగారి దగ్గరకెళ్లి, నమస్కారంచేసి "అయ్యా! మీతో ఒకగొప్ప రహస్యం చెప్పదలచుకున్నాను. దాని విషయంలో నాకు తగిన సలహా ఇస్తేమీకష్టం పూరికే పోనియ్యను" అన్నాడు.

"అబ్బాయి! మావుద్యోగపుపద్ధతుల్లో రహస్యం అనేది ఒకటి. మారోగుల జబ్బులవిషయంలో మేము రహస్యం వుంచకపోతే మాగౌరవానికి చాలా భంగం వస్తుంది. అటువంటి భయం ఏమీ వుంచుకోకుండా నీమనస్సులో వున్నదేదో చెప్పు. తగినచికిత్స చేస్తా" నన్నారు డాక్టరుగారు. ఇక నేముందీ, తన సలహాదారుడు తనమాట రహస్యంగా వుంచడానికి పూచీపడ్డ తర్వాత ఇంక తనకథ ఏకరువుపెట్టడానికి బిడియం ఎందుకనుకుని చంద్రారెడ్డి కాసులు కాపరంవున్న మేడనీ, కాసులు అందాన్నీ, పూర్తిగా వర్ణించి, ఆవిడ భర్త డాక్టరైనట్టున్నూ, చాలా అనూయస్వభావంకల వాడైనట్టున్నూ చెప్పి.

"అయ్యా! ఆఅమ్మాయిని నేను మనసార ప్రేమించేను. ఇంకా పూర్తిగా ప్రపంచజ్ఞానం తెలియక పోవడంచేత, ఆవిడని సమీపించి ఏవిధాన్నీ మాట్లాడలేకపోతున్నాను. మీ రెలాగ చెప్పుతే అలాగ నడుస్తాను. ఏదైనా దారివుంటే చూపించండి" అన్నాడు.

ఈకథంతా వినేసరికి రంగారెడ్డి నిలువునా నీరైనాడు. కొంప మునిగిందనుకున్నాడు. కారణం, చంద్రారెడ్డి వరించినది తనపెళ్లాం కాసుల్నే. కాని, తనవుద్రేకాన్ని పైకి వెలిబుచ్చలేదు. ఈనాటకం ముందుకి ఇంకా నడుపితే తనభార్య్య కాసులు పవిత్రత కూడా పైకి రాగలదని ఆలోచించి, తనగుట్టంతా గుట్టుగావుంచి, చంద్రారెడ్డివేపు చూసి,

"అబ్బాయి! ఇంతమాత్రానికేనా నీవింత హడలిపోతున్నావు. ఆవిడని నీవలలో పడెయ్యడానికి మంచి సులువొకటి చెప్తాను విను. నువ్వు చెప్పినమనిషిని నేను బాగా ఎరుగుదును. ఆవిడభర్త ముసీలిపండు. ఈవిడచూస్తే మంచి యౌవనంలో వుంది. ఈకారణంచేత నీఆటల్లో ఆడి, నీవలలో చిక్కడం అట్టే కష్టంకాదని తోస్తుంది. ఆవిడింటికి నువ్వువెళ్లి, ఆవిడముందు ఆవిడసౌందర్యాన్ని వర్ణించు; ఎక్కడలేనీ విశేషణాలు వేసి తనంత అందకత్తె లేదని, ఇంకెవ్వరిని నువ్వింతగా ప్రేమించలేదని చెప్పి ఆవిడని మాయలో పడెయ్యి. అప్పటికీ నీవలలో యీచేపపడకపోతే నేనొక మంచి మందిప్పించి ఆపనిచేయిస్తాను. అన్నట్టు చెప్పడం మరిచిపోయేను. ఆవిడభర్త రోజూ మధ్యాహ్నం మూడు గంటలుమొదలుకొని ఆరుగంటలువరకూ ఇంటిదగ్గిర వుండడు. ఈసమయంలో ఎప్పుడైనా నీవు వెళ్లు. నీకింతగా నేను బోధపర్చడాని క్కారణం నేనూ నీవయస్సులో వున్నప్పు డిలాగే చిక్కులుపడేవాణ్ణి. మరొకటి సుమా! ఈసంగతిరహస్యంగా వుంచాలిస్మీ!

నే నిటువంటి వృత్తుల్లో దిగేనని పైకి తెలిస్తే నాపరపతికి భంగంవస్తుంది జాగ్రత్త" అన్నాడు.

చంద్రారెడ్డి.— అయ్యా! నేను కావలసినంత జాగ్రతతో ప్రవర్తిస్తాను. రేపటిరోజున ఏమిజరిగినదిన్నీ మనివిచేసుకుంటూ యీవేళకే, ఇక్కడే మీదర్శనం చేస్తాను-అనిచెప్పి వెళ్లిపోయేడు.

రంగారెడ్డి ఒంటరిగా కూర్చుని జరిగినకథ మళ్లీ జ్ఞాపకంచేసుకుని విచారిస్తున్నాడు. ఆలోచిస్తూన్నకొద్దీ కాసులు తనకి దూరంఅయిపోతోంది. పిచ్చెత్తినట్టు తోటంతా తిరుగుతున్నాడు.

ఈలోగా, యథాప్రకారం చంద్రారెడ్డి భాండాగారంనుంచి వస్తూ, కాసుల్ని కిటికీదగ్గరనుంచి చూసేడు. ఈరోజున మరింత ప్రేమపూరితమైన చూపుల్తోటి, ఆవిడ ఇతన్ని ఆదరించింది. ఇదికొంత రెడ్డికి ధైర్యంఇవ్వడంచేత ఆవిడగుమ్మంలోకి వెళ్లి తలుపు గుద్దేడు. వీరమ్మ తలుపుతీసింది. "మీ అమ్మగారిని చూడాలి" అన్నాడు చంద్రారెడ్డి. ఇంతలోకే కాసులు మేడదిగి, చంద్రారెడ్డిని ఆదరణతోటి తనగదిలోకి తీసుకెళ్లింది. ఇంకా చిన్నతనంచేతనో, మరి కొత్తగా వుండడంచేతనో చాలాబిడియంగా వుంది రెడ్డికి. కొంతతడువు ధైర్యం తెచ్చుకుని, కాసుల్ని చూస్తూ ఆవిడని తాను వరించినట్టున్నూ, కలకాలం ఆవిడస్నేహితుడై వుండి సేవచేయడానికి ఆజ్ఞ ఇయ్యాలసినదనిన్నీ కోరేడు. కాసులు చంద్రారెడ్డిని ప్రేమించిందని ఇదివరకే చెప్పేం. కాని, పూర్తిగామాత్రం ఆవిడ మనసు వెలిబుచ్చలేదు. రేపటిరోజున నాలుగ్గంటలకి ఫలహారానికి రావలసిందని రెడ్డిని ప్రార్థించింది. తప్పకుండా వస్తానని మాటఇచ్చి వెళ్లలేక వెళ్లలేక రెడ్డి కాసులివేలికి తనవుంగరం తగిలించి వెళ్లిపోయేడు.

డాక్టరుగారు, చంద్రారెడ్డి ఏమివార్త తెస్తాడో అని ఎదురుచూస్తున్నారు మ్యూజియంలో. ఇంతలోకే చంద్రారెడ్డి అక్కడికి వచ్చేడు. ఇతన్ని చూసి డాక్టరుగారు,

"ఏమయ్యా! చంద్రారెడ్డి, ఏమిటివింతలు? పాచికెలా పారింది?" అన్నాడు.

చంద్రా.—మనం అనుకున్నట్టే. ఆవిడతో చాలాసరసు మాట్లాడేను. కొంత లొంగినట్టుగానే కనపడుతోంది. ఇంక ఆముసిలిగాడిదకొడుకుని రెండుచెవులూ పట్టుకుని ఈడ్చెయ్యొచ్చును.—ఈమాటలు వినగానే రంగారెడ్డి పడిన అవస్థ వర్ణించడానికి శక్యంకాదు. అసూయ అంటే ఎంతబలమైందో తెలిసినవారు వూహించవలసిందే కాని మేము చెప్పలేము. కాస్త స్తిమితపడి రంగారెడ్డి "మళ్లీ ఎప్పుడు రమ్మంది?" అన్నాడు.

చంద్రారెడ్డి.— రేపుసాయంత్రం నాలుగ్గంటలకి

రంగా.—రేపు మళ్లీ కలుసుకుందాం అని చెప్పి ఇంటికి వెళ్లేను. తనవిచారం అంతా నవ్వులో దాచుకుని తెల్లవారే వరకూ శాంతంగా పడుక్కున్నాడు.

౮

రంగారెడ్డి భోజనంచేసి, బట్టలువేసుకుని, ఎన్నడు నాలుగంటలవునా అని ఆ దుర్దాతో వూరల్లా తిరుగుతున్నాడు అతనిపట్టుదల, ఏమైనాసరే, చంద్రారెడ్డీ కాసులూ మాట్లాడుతూంటే చూసి పట్టుకుని వీలైనమార్గంగా ఇద్దరిమీదా పగతీర్చుకుందాం అని.

ఇంతలోకే డాక్టరుగారింట్లో లేని సమయం చూసి చంద్రారెడ్డి కాసులున్నగదిలో కెళ్లేడు. వీరమ్మ వీథితలుపు మూసేసింది. కాసులున్నూ చంద్రారెడ్డిన్నీ కూచుని మాట్లాడుతున్నారో లేదో హఠాత్తుగా వీథితలుపు "బడబడ" చప్పుడైంది. అప్పుడే నాలుగ్గంటలయిందన్నమాట. బెదిరి బేజారైపోయి వీరమ్మ కాసుల దగ్గర కెళ్లి "అమ్మా! డాక్టరుగారొచ్చేరు. లెండి! లెండి!" అని అరిచింది. కాసులు మొదట చాలా భయపడింది. కొంప మునగడానికి సిద్ధంగా వుందనుకుంది. కాని, ఆయుక్తులికి కాసులుకే పెట్టింది పేరు. వెంటనే చంద్రారెడ్డిని యీడ్చుకెళ్లి భర్త పరుపుకుట్టించుకుందుకు తెప్పించిన హంసయీకలున్న పీపాగొట్టంలో కూచోబెట్టి, మూతేసి, ఏమీ ఎరగనట్టుగా వూలుతో సంచులు కుట్టుకుం

టోంది. ఈలోగా రంగారెడ్డి కారుదిగి, హడిలిపోయి పడిపోయి, ఏదో మరిచిపోయినట్టుగా, గదితాళాలు పుచ్చుకుని, ఇల్లంతా శుభ్రంగా ప్రతిమూలా వెతికేడు. చిన్న ఎలకబొర్రయినా తనచాటున పడలేదు. ఇంట్లో చంద్రారెడ్డి కనపడకపోవడంచేత విసుగుపడి, కుర్చీలో కూలబడి, అస్వస్థతగా వుందని చెప్తూ విసురుగుంటూ ఇంట్లోనే వుండిపోయేడు రంగారెడ్డి. అందరూ బాగా నిద్రపోయేక వీరమ్మ చంద్రారెడ్డిని పీపాలోంచి పైకితీసి పెరటితోవని పంపేసింది.

మర్నాడు మామూలుగా చంద్రారెడ్డి రంగారెడ్డిని మ్యూజియంలో కలుసుకుని రాత్రి జరిగిన కథంతా పూర్తిగా చెప్పేసేడు.

"ఎంతపని చేసిందిరా! కాసులు" అని అనుకుని ఏమీ ఎరగనట్టు నటిస్తూ,

"అయ్యోపాపం, కష్టం అంతా వృథాగా పోయిందే" అన్నాడు రంగారెడ్డి.

"అయితే నేమండీ! లక్ష్మీవారంనాడు ఆముసిలాయన వూరికి నాలుగుమైళ్లలో వున్న స్నేహితుడింటికి విందుకని వెడతారుట. ఆవేళ నాలుగ్గంటలకి తప్పకుండా రావలసిందని దాసిదానిచేత ఇంటికి కబురు పంపించింది కాసులు" అన్నాడు చంద్రారెడ్డి.

"అలాగనా? ఎంత అదృష్టవంతుడివోయి నువ్వు" అంటూ ముఖంలోంచి రాలుతున్న అగ్నికణాల్ని చెమటచేత చల్లార్చేడు రంగారెడ్డి.

కథానాయకులకీ, సూత్రధారుడికీ కూడా ఎంతో కష్టంమీదట లక్ష్మీవారం వచ్చేసింది. ఇంచుమించుగా నాలుగ్గంటలకి రంగారెడ్డి ఇల్లువిడిచి, సమీపంలో వున్న స్నేహితుడింట్లో కూచుని, ఎదురుగుండా కనిపించే తన ఇంటి గుమ్మం కేసి చూస్తున్నాడు.

ఇంతలోకే చంద్రారెడ్డి ముస్తాబై తను ప్రేమించిన వనితతోటి కులాసాగా చాలాసేపు కాలక్షేపం చెయ్యొచ్చునని తలచి అతిగోటుగా వచ్చేడు కాసులింటికి. ఇతను రావడం ప్రత్యక్షంగా చూసేడు రంగారెడ్డి.

గదిలో కాసులూ చంద్రారెడ్డి ఒకరికౌగిట్లో ఒకరున్నారు. ఇంతలో వీరమ్మ గంతులేస్తూ "బాబు! బాబు" అని కేకలేస్తూ రంగారెడ్డిగారి రాక తెలియజేసింది. ఏమాత్రపు వుపద్రానికేనా జాగ్రత్తగా వున్న కాసులు, చంద్రారెడ్డిని మళ్లీ యీడ్చుకెళ్లి, అటకమీద గుండిగెల మాటున కూచోబెట్టి, తనబల్లదగ్గరకి వచ్చేసి పుస్తకం చదువుకుంటోంది ఏమీ ఎరగనట్టుగా.

చెమట్లు కక్కుకుంటూ, అగ్నికణాలు రాల్చుకుంటూ, వేడి వగర్పులు వగరుస్తూ, ఎక్కడా లేనిబలం తెచ్చుకుని పరుగెత్తుకొచ్చేరు డాక్టరుగారింటికి.

ఏదోకొంప మునిగిందన్నట్టుగా కాసు ఎదురుగుండా వెళ్లి భర్తను పట్టుకుని, "అదేవిటి! విందుకనిపోయి ఇంతవేగిరం వచ్చేరూ" అంది.

రంగారెడ్డి. "ఒసేవ్! ఈవేళ చెప్పడం మరిచిపోయేను. నిన్నరాత్రి ఒక చెడ్డకల వొచ్చింది. ఎవడో దుర్మార్గుడుట, దురుద్దేశంతోటి మనింట్లోకి చొరబడి ఎక్కడో దాంకున్నాట్ట. ఎంతవెతికినా నాకు కనిపించేడు కాడుట. ఆవుగ్రంరూలంగా నాముక్కులోంచి రక్తం వచ్చిందిటు. ఈసంగతి జ్ఞాపకానికి వచ్చి, భయంవేసి తిరిగివచ్చేసే. ఏదీ! చూదాం వుండు. ఇల్లంతా వెతికి ఏవడేనా గాడిదకొడుకు దాంకున్నాడేమో కనిపెడదాం" అన్నాడు.

కాసులు "అయ్యో! అంత పాడుకలే? ఏదీ వెతుకుదాం రండి" అంది.

వెంటనే డాక్టరుగారు అన్ని తలుపులూ మూయించి, ఇంట్లోవున్న గదులు, గాబులూ, భోషాణాలూ, కావిడిపెట్టెలూ శుభ్రంగా వెతికి, కనిపించిన బస్తాలు, దూదిని, హంసయీకలిని, పీపాలు, కర్రతో కొట్టికొట్టి, ఎవరూ కనపడకపోవడంచేత "అన్నీ అబద్ధపు కలలేనే, పాడుకలలు" అంటూగదిలో కూలపడ్డాడు. "అటకమీద వెతకడం మరచిపోయేరు" అనుకుంది కాసులు నవ్వుకుంటూను. తాతగారి కేవిాతోచక తెల్లారేవరకూ నిద్దరపట్టలేదు. చంద్రారెడ్డి చెప్పినవిషయాలు చూస్తే ఒకలాగున్నాయి. తాను వెళ్లి పరిశీ

లిస్తే ఆచోకీ ఏమీ దొరకదు. ఇంతకీ చంద్రారెడ్డీ తన గుమ్మం దాటి లోపలికి వెళ్లడం చూసేకుకాదూ? ఇల్లంతా వెతికి అతను లేకపోవడంమూసి అదివొట్టి భ్రమ అనుకున్నాడు పాపం ఈముసిలిమొగుడు. ముసిలి మొగుడూ పడుచుపెళ్లాం అయితే ఇదే గ్రహచారం. ఈవ్యూహాల్లోటి తెల్లవారేక నిద్దరపోయేరు డాక్టరుగారు. ఆసమయం కనిపెట్టి వీరమ్మ చంద్రారెడ్డిని ఇంటికి పంపేసింది.

చంద్రారెడ్డిని ఇంకపట్టుకోవడం దుర్లభం అనుకున్నాడు రంగారెడ్డి. ఇంటికట్టు ప్రమాదావస్థలోకి వస్తుందేమో అనుకున్నాడు. "ఇంతకీ గ్రహచారం కాకపోతే, ఎనభైఏళ్ల కొడుక్కి పెళ్లాంయుం డేనిటే, తిన్నగా బతకలేక? ఎవరు కొడ్తున్నారో చెప్పుదెబ్బ బాగాకొడ్తున్నారు" అనుకున్నాడు మర్నాడులేచి. అయినా పంతం, కోపం ఆపుకోలేకపోతున్నాడు. ఎలాగైనా చంద్రారెడ్డిని బహిరంగంగా పట్టుకుని మూడు చెరువులనీళ్లు తాగించితీరా లనుకుని బుర్రలో గొప్ప పన్నాగం ఒకటి పన్నేడు. అదేమి టంటే, తనభార్య కాసుల్దగ్గర కెళ్లి "ఓసేవ్! నేనీవేళ సీతానగరం వెళ్లాలి పనిమీద. పదిరోజుల్దాకా రాలేను. అంతవరకు నువ్వు యీఇంట్లో వుండడం నాకిష్టం లేదు. ఆర్యాపురంలో మనపురింటిలో వుండు నేవచ్చేవరకు" అన్నాడు.

"సరే మీఇష్టం" అంది కాసులు.

ఈఏర్పాటు చేయించి రంగారెడ్డి మ్యాజియంలో చంద్రారెడ్డిని కలుసుకుని,

"ఏమయ్యా! ఇప్పటికి నువ్వు వరించిన స్త్రీ నీపొత్తు చేరిందని తెలుస్తా"నన్నాడు.

"ఏమి చేరడ మండీ. ఆముసిలితుండాకొడుకు దగ్గర కర్ణపిశాచం వుంది కాబోలు. లేకపోతే ఏమిటండీ, నేనతనింట్లో అడుగుపెట్టేనో లేదో, వెంట తరివినట్లు తానూ వచ్చేస్తున్నాడు. నిన్ననూ అలాగే అయింది. రాత్రల్లా అటకమీద వుండి తెల్లారింతర్వాత లేచొచ్చా"నన్నాడు చంద్రారెడ్డి.

"అమ్మ! వీడి సిగాతరగా, ఎంత పనైందిరా" అని అనుకుని రంగారెడ్డి, "అబ్బాయి! నీదినాలు బాగాలేవు." అన్నాడు.

"ఇదిగో తాతగారూ! ఇంకొక్కమాటు ఆఖరు ప్రయత్నం చేస్తాను. ఈవేళనుంచీ నాఅదృష్టం బాగుంటుంది. ఏమో! ఆముసలాడు సీతానగరం వెళ్లి పదిరోజులువరకూ రాడుట. అంతవరకూ ఆడాళ్లు ఆర్యాపురంలో బస. వాడు లేనిసమయం చూసి, నాకష్టాలు దాటేటట్టు నాపగ తీరేటట్టు, ఆర్యాపురంలో నేనూ బసచేస్తాను" అన్నాడు చంద్రారెడ్డి. "నీరోజులు దగ్గిర పడ్డాయిలే" అనుకుని రంగారెడ్డి, చంద్రారెడ్డితో వెడతానని చెప్పి వెళ్లేడు.

౬

మర్నాడు రంగారెడ్డి, భార్యనీ, వీరమ్మనీ వెంటబెట్టుకుని ఆర్యాపురంలో తన పురింటిలో దింపి, అందరతోటి చెప్పి, సీతానగరందారి పట్టేడు. సగందూరం పోయి కొంచెరుకయితుల్ని పోవు చేసుకుని, వెనక్కి మళ్లి పురింటి వెనకాలున్న తుప్పల్లో దాగుని, ఇంట్లో ఏమి జరుగుతున్న దిన్నీ కనిపెడుతున్నాడు.

మధ్యాహ్నం అవగానే చంద్రారెడ్డి గుర్రం మీద ఆర్యాపురంవరకూ వచ్చి, "సైసు"చేత గుర్రాన్ని ఇంటికి పంపేసి, కాలినడకని కాసులున్న పురింటిలో దూరేడు. ఈసంగతంతా కనిపెడుతున్నాడు రంగారెడ్డి చెట్లతోపులోనుంచి. కాసులు స్వయంగానే ఎదురుగా వచ్చి చంద్రారెడ్డికి స్వాగతం ఇస్తూ తిన్నగా తనపడకగదిలోకి తీసుకెళ్లింది. అక్కడ కాసులు,

"ఈబీదపురింట్లోకి రాడానికిమీరు సంకోచించవద్దు" అంది చంద్రారెడ్డితో.

"నిర్మలమైన ప్రేమ వుంటే పురిల్లైతే నేమి?" అన్నాడు చంద్రారెడ్డి నవ్వుతూ. ఇంతలోకే వీధిలోనుంచివీరమ్మ కేకలేస్తూ వచ్చి "అయ్యో! అయ్యో! బాబు వందరుందితో ఇల్లుసోదాచేయడానికి వచ్చేరు.

లే! లే" అంది. ఈమాటలు వినడంతోటే చంద్రారెడ్డి గుండెలుబద్దలైనాయి. తన ఆఖరుమాటగా, "కాసులూ! నాకుమృత్యువు తప్పదు. కడసారి ప్రార్థన, ఒకముద్దు" అన్నాడు.

కాసులు నవ్వుతూ "భయపడవద్ద"ని అతనిరెక్క పట్టుకుని ఒకగదిలోకి యీడ్చుకెళ్లింది. అందులో రంగారెడ్డి తాలూకు రికార్డువున్న భోషాణం ఒకటి వుంది. ఆభోషాణంలో చంద్రారెడ్డిని కుక్కి అతని మీద రికార్డుకట్టలు కప్పేసింది. ఆహా! చంద్రారెడ్డి అవస్థ. స్త్రీవాంఛాపరుల గతి ఇంతేకదా! క్షణక్షణము ఇటువంటివారికి ఆయుఃపరిమాణము తగ్గుచుండడమే కాకుండా, మానము, గౌరవమునూ అసలికే శూన్యం అయిపోతాయి. అయినా చంద్రారెడ్డి అదృష్టంబాగుంది. తాను వరించిన వనిత ఇంతకీ ఉద్దండురాలు.

చంద్రారెడ్డిని భోషాణంలో దాచి, భర్తకెదురెళ్లింది కాసులు. ఆవిడని చూసి మండిపడి రంగారెడ్డి,

"ఓసీ రాక్షసీ! నీమొగుడెక్కడున్నాడే? వాడీఇంట్లోకి రావడం మేము చూసేం. ఇక నీతంత్రగొట్టుతనం పనికిరాదు. నీఅటుక నీగోనుసంచులూ నీపిపాలు ఇక్కడెందుకూ పనికిరావు. ఇంటికి చిచ్చుపెట్టేస్తున్నాను" అన్నాడు.

"నేనేమీ ఎరగను. అనవసరంగా నన్ను తూలనాడొద్దు. మీపిచ్చికి చేతనైన పనిచేయండి. నా అభ్యంతరం లేదు" అంది కాసులు. మరింత మండిపడి రంగారెడ్డి ఇంటికి చిచ్చుపెట్టేసేడు. పొగలో ఉబుకుతోంది పురిల్లు. ఆకాశాన్ని అంటుతూన్నాయి అగ్నినాలికలు. ఇటువంటి సమయంలో చంద్రారెడ్డి స్థితి ఎలాగ వర్ణించడమో తెలియకుండా వుంది. చేసేది లేక రామనామం పఠిస్తున్నాడు భోషాణంలోపల. దుర్మార్గులికి కాలం అయినప్పుడు, వారు తలచినపని జయప్రదంగా అవుతుంది. న్యాయమైన ప్రవర్తన వుంటే ప్రపంచంలో జీవించడం కష్టంగావుంటుంది. అందుచేత, అన్యాయంగా ప్రవర్తిస్తూ వలుగరితో పాటు "నారాయణా" అని ఆఖరు గుటక వెయ్యడమో, లేక, అందర్లోనూ న్యాయస్థుడై నక్షత్రాల్లో చంద్రుడై వుండడమో చెయ్యాలి. ఇట్టివారు ఇప్పట్లో చాలా అరుదు. కాకపోతే, చంద్రారెడ్డి అగ్నిలో మలమలమాడక ఎలాగ బయటపడ్డాడో చూడండి. తనప్రియుడు అగ్నిలో పడి చచ్చిపోతున్నాడని తెలుసుకుంది కాసులు. కాని ఏమాత్రంను చలించక, వీరమ్మని చూచి, "వీరమ్మా' నీయజమాని అనూయచేత మతిపోగొట్టుకుని ఇంటికి చిచ్చుపెట్టేసేరు. ఆభోషాణంలో మన ఆస్తిపాస్తుల వివరం అంతా కాగితాల్లో వుంది. అదికూడా ఇంటితోపాటు తగలబడితే, ఆయనా నేనూ చిప్పట్టుకుని తిరగవలసిందే. ఇప్పుడైనా పోయి మనం మోసుకొద్దాం రా" అంది.

ఆహా! ఆడది ఎంత చమత్కారి. దానివ్యూహాలు కనిపెట్టగల పురుషుడు ప్రపంచంలో వున్నాడా? ఆ యుక్తులూ, ఆ తంత్రాలూ, ఆ ఆలోచన్లూ పైవారికుండగలవా? దీనికి తార్కాణ మన కథానాయిక కాసులే కాదా? "భోషాణం" "రికార్డు" అనడంతోటే వులిక్కిపడి చూసేడు రంగారెడ్డి. అదికూడా ఇంటితోపాటు తగలడితే కాసులు చెప్పినట్టు చిప్పచేతికి వస్తుందనుకున్నాడు. ఇద్దరి మనుష్యులచేత భోషాణాన్ని ఇవతలకీడ్పించి మామిడితోపులో వుంచి తర్వాత ఇంటికి పంపేసేడు. ఇల్లంతా పూర్తిగా కాలేవరకు అక్కడవుండి అందులోపడి, చంద్రారెడ్డి చచ్చిపోయేడని సంతోషిస్తూ, ఇక శాంతంగా నిద్రపోవచ్చునని, రాజమహేంద్రవరం కుటుంబంతోటి వెళ్లేడు రంగారెడ్డి.

కాసులికి రంగారెడ్డి ప్రవర్తనచూస్తే, అసహ్యం, భయంకూడావేసి, పుట్టింటికెళ్లి తలితండ్రులతో మొరపెట్టుకుంటూ, అన్యాయంగా తనమీద భర్త నిందఆరోపించేడని చెప్పింది. ఇదంతా తనకూతురికి ముసిలిమొగుడ్ని కట్టినందుకు వచ్చిన గ్రహచారంఅనుకుని, గౌరరెడ్డి అల్లుడిదగ్గరకి కుటుంబసహితంగా వచ్చి, కాసులు చెప్పిన విషయానికి సమాధానం అడిగేడు. ఒకరోజులో ఇదంతా నిశ్చయంగా జరిగిందని ఋజువుచేస్తానని మామగారివద్ద ఇరవైనాలుగుగంటలు గడువు పుచ్చుకొన్నాడు రంగారెడ్డి. ఇందుకంతా ఒప్పుకున్నారు. ఆమర్నాడు

విందుకు రావలసినదిగా పున్నమ్మ అల్లుణ్ణీ కూతుర్నీ కోరింది. విందుసమయం అప్పుడే అంతా ఋజువు చెయ్యడానికి నిశ్చయించేరు.

## ౧౦

యథాప్రకారంగా డాక్టరుగారు షికారుకని మ్యూజియంలోకి వెళ్లేరు. అక్కడికి వెళ్లగానే చంద్రారెడ్డి మళ్లీ సిద్ధమయ్యేడు. అతన్ని చూసి తెల్లబోయేడు తాత. "చచ్చిపోయినవాడెలాగ బ్రతికివచ్చేడో" అని ఆశ్చర్యపడ్డాడు. జాగ్రతమనిషి కనక ఇదంతా కప్పిపుచ్చి,

"ఏమయ్యా! చంద్రారెడ్డి! విశేషాలేమి"టన్నాడు. "విశేషాలంటే విశేషాలా" అంటూ కడుపు పట్టుకుని నవ్వుతున్నాడు చంద్రారెడ్డి. అతని నవ్వొక్కొక్కటి రంగారెడ్డిని బొటనవేలినుంచి దహించేస్తోంది. కాని ఏమి చేయగలడు! ముసిలిమొగుడై బ్రతికి వుండకూడదనుకున్నాడు పాపం. చంద్రారెడ్డి నిన్న ఆర్యాపురంలో జరిగిన వుదంతం అంతా చెప్పేడు. ఆశ్చర్యంగా చూస్తూ రంగారెడ్డి,

"భోషాణంలోంచి చెలా తప్పించుకున్నావు" అన్నాడు.

"భోషాణానికి తాళం లేదు, పురిట్లోంచి నేనున్న భోషాణాన్ని ఇంటికి యీడ్చుకెళ్లడం గ్రహించేను. కూలీలు భోషాణం వొదిలి వెళ్లడంతోటే, నా అంతట నేనే తలుపుతెరుచుకొచ్చే" నన్నాడు నవ్వుతూ చంద్రారెడ్డి.

ఈమాటవినడంతోటే గుండెల్లో రాయిపడినట్టయింది రంగారెడ్డిగారికి. స్త్రీ అంటే ఏమిటో గ్రహించుకుని గజగజ వణికేడాయన. "తాచుపాముని పెళ్లాడితే బాగుండేది, ఇంతవయస్సులో కాసుల్ని పెళ్లాడేకంటే" అని అనుకుని,

"అబ్బాయీ! నేనీరోజున మా అత్తారింటికి విందుకెడుతున్నాను. నువ్వుకూడా రావడం నాకోరిక. అక్కడ నీకున్నూ డాక్టరుగారి భార్యకిన్నీ వున్న సంబంధం విషయం సంతోషంగా మచ్చటించుకుందాం" అన్నాడు చంద్రారెడ్డితో.

"అలాగే మీమాట కడ్డుచెప్తానా" అన్నాడాయన శిష్యుడు.

అత్తవారింటి కెళ్లగానే, భావమరదుల్నీ, అత్తమామల్నీ చేరదీసి చంద్రారెడ్డిని చూపించి, ఈతనే కాసుల్ని వరించేడనిన్నీ, తాను కాసులు పెనిమిటనే సంగతతనికి తెలియదనిన్నీ, యీసంగతంతరూ గుట్టుగా వుంచాలనిన్నీ చెప్తూ రంగారెడ్డి విందుకి కాసుల్ని రానియ్యొద్దని ఆజ్ఞాపించేడు.

అత్తమామలు చంద్రారెడ్డికి స్వాగతం ఇచ్చేరు. విందు జరుగుతోంది. అందరూ ఒకపంక్తిని కూచున్నారు. చంద్రుడొక్కడూ ఒకపక్కని కూచుని, తన ఇష్టం వచ్చినట్టూ మతిలేని వాడిలాగ, వెనకాముందు ఆలోచన లేకుండా, తనకీ కాసులికీ వున్న సంపర్కం ఆదినుంచి తుదివరకూ చెప్పేస్తున్నాడు. ఈవుదంతం వింటున్న వారి అందర్లో నవ్వులేక, భయంగా చూస్తూన్నది ఒక్క కాసులే గదిమాటునుంచి. తన గుట్టంతా తెలివితక్కువగా చెప్పేస్తున్నాడు. అన్ని అంశాలూ చెప్పడం అయింది. ఇంక తనకీ కాసులికీ అయినసమావేశం గురించి చెప్పబోతూ మంచినీళ్లు కావాలన్నాడు చంద్రుడు. ఇదేసమయం కనిపెట్టి, ఒకగ్లాసులో నీళ్లుపోయించి, అందులో ఒకానొకప్పుడు, అనగా, వారిరువుర మొదటి సమావేశంలోనూ చంద్రుడు తనకిచ్చిన వుంగరాన్ని పడేసి వీరమ్మచెల్లెలిచేత పంపింది కాసులు. ఇంతలోకి చంద్రుడికథ, ఆర్యాపురంలో ఇల్లుతగలపెట్టడంవరకూ వచ్చింది. నిజంగా తనని కాసులు ప్రేమించిందని నిర్ధారణచేయబోతూ, గ్లాసెత్తి నీళ్లుతాగబోతూంటే ఉంగరం కనిపించిందతనికి. ఆశ్చర్యంతో దానివేపు చూసేడు. నాలిక కరుచుకున్నాడు. తనభావనమాత్రం వెలిబెట్టలేదు. "నాదేనా యీవుంగరం? ఇక్కడికెలా వచ్చింది?" అనుకున్నాడు. ఆలోచించేడు. గ్రహించేడు చంద్రుడు. కాసులు తన సలహాదారు పెళ్లామేనా అనుకున్నాడు. చిరునవ్వు నవ్వుకున్నాడు. "డాక్టరుగారు

రంగారెడ్డిగారేనా ? ఎంతమోసం." ఉంగరం నీళ్లతో మింగేథ తనకథ ఇంకా చెప్పుతున్నాడు. కథంతా పూర్తిచేసి, గౌరరెడ్డికాసి చూసి

"అయ్యా! ఎలాగ వుంది నేనుచెప్పిన నాచరిత్ర" అన్నాడు చంద్రారెడ్డి.

"మహాఅద్భుతంగా వుంది. ఇదంతా నిజంగా జరిగిన్దేనా బాబూ!" అన్నాడు వణుకుతూ గౌరరెడ్డి.

చంద్రారెడ్డి.—ఏమిటయ్యా! అలాగ అనుమానిస్తారు. నిజంగా ఆవిడభర్తే ఇక్కడుంటే ఆయనదగ్గర మాత్రం దాస్తానా యీసంగతి.

గౌరరెడ్డి, రంగారెడ్డి తెల్లబోయి ఒకరివంక ఒకరు చూసుకుంటున్నారు. ఎవ రేమనాలో తెలియడం లేదు. అప్పుడు చంద్రారెడ్డి మళ్లీ ప్రారంభిస్తూ,

"అయ్యా! రెడ్డిగారూ, కాసులిభర్తగారు యీ రంగారెడ్డిగారే అని నేను మొదటే ఎరుగుదును. ఈయన వట్టి అసూయగలవాడున్నూ, బుద్ధిలేనివాడనిన్నీ మా వూరిలో వాడుక. ఈయనికి యీవేడుక కథలన్నీ చెప్పూ, కాసులిమీద ఏవిధమైన అనుమానంనూ లేకండా ఉండేటట్టు చేద్దామని యీకథలు చెప్పుతూ, ఈయన్ని ఒక మార్గంలో పెట్టేను. అంతేకాని, నిశ్చయంగా కాసులెవరో నేనెరగను. ఆవి డెలా వుంటుందో నేనెరగను. ఆవిడతో నేనెన్నడూ మాట్లాడలేదు. మీరు నిజంగా ఆవిడని తీసుకువచ్చి కాసులవునా కాదా అంటేకూడా నేను పోల్చలేను. రంగారెడ్డిగారికి తలతిక్క కలగడం తాను ముసలాయ నవడంచేతనూ, పెళ్లాం పడుచుదవడం చేతనున్నూ, ఇంతేకాని సత్యంగా నేనూ కాసులూకూడా నిర్దోషులం. కాని ఒకటి; ఈయన ఇప్పటి చరిత్ర ప్రపంచంలో ఒక నిదర్శనం కాగలదు; ఎలాగంటే, ఎనభై ఏళ్లు నెత్తికొచ్చి, గడ్డంబలిసి, పళ్లువూడి, శరీరంకుష్కించి, ఒరడులాగ బ్రతికి, ఇంకా "పెళ్లాం పెళ్లాం" అని ఏడ్చే బుద్ధిహీనులీతని కథవిని పెళ్లివద్దని ఒట్టుపెట్టుకుంటారని నావూహ." అని చెప్పుతూ చమత్కారంగా దోషం అంతా రంగారెడ్డినెత్తి నేసి తను తప్పించుకుని, కాసుల్ని అమర్యాదనుంచి తప్పించేడు చంద్రారెడ్డి.

ఈకథంతా విని, కడుపు చెక్కలయ్యేటట్టు నవ్వుతూ బావమరదులందరూ "బావా! మతాబా కాల్చేవా" అని అడిగేరు. "ఇది నాగ్రహచారం" అన్నాడు రంగారెడ్డి. అంతా నవ్వేరు. వృద్ధుడైన రంగారెడ్డి అద్భుతంగా చూసి, "ఆ! ఆ!" అంటూనే నేలమీద పడి చచ్చిపోయేడు. ఉత్తరక్రియలైనాక కాసులు రాజమహేంద్రవరం చేరి, ఆస్తికి అధికారం పుచ్చుకుంది. విధవావివాహ సమాజంవారు యీవిడస్థితిచూచి చంద్రారెడ్డికి ఆవిడకీ కలసంబంధం కనుక్కొని, ఇద్దరకీ శాస్త్రోక్తంగా పెళ్లిచేసి సంఘాన్ని విరపించేరు.

"తేనెటీగ పువ్వునున్న తేనెనే తాగుతుందికాని, ఏనుగుతలపైనున్న చమురు పీలుస్తుందా" అంటూ కాసులు దగ్గరకెళ్లి సంతోషంగా కౌగలించుకున్నాడు చంద్రారెడ్డి.

"బుద్ధివచ్చిం"దంటూ రంగారెడ్డి ఆత్మ, పైనుంచి కేకేసినట్టు వీళ్లిద్దరూ విని నవ్వుకున్నారు "ఎవరి పువ్వు వారితలలో వుందికదా"అని సంతోషిస్తూ.

---